ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 21 జూలై 2024



# మఠం భూమి రిజిస్ట్రేషన్‌ను ఆమోదించొద్దు

**చట్టపరమైన చిక్కులు తప్పవ్**
**ధర్మవరం సబ్ రిజిస్ట్రార్‌కు సీపీఐ వినతి**



సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

**ధర్మవరం, జూలై 20:**
బత్తలపల్లి సమీపాన 401 సర్వే నంబరులోగల నిడిమామిడి మఠం భూమిని మాజీ ఎమ్మెల్యే అనుచరులు, వైసీపీ నాయకులు నకిలీ పత్రాలతో మరొకరికి అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేయించారనీ, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించొద్దని ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ వెంకటరమణరావుకు సీపీఐ నాయకులు విన్నవించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రాష్ట్ర నాయకుడు జింకా చలపతి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ వెంకటరమణరావును కలిసి, వినతిపత్రం అందజేశారు. మధు మాట్లాడుతూ... 19.84 ఎకరాల ఆ భూమి బెంగళూరుకు చెందిన నిడిమామిడి మఠానికి చెందుతుందన్నారు. ఆ భూమిలో కొందరు రైతులు పంటలు సాగు చేయడంతో గ్రామ కంఠంగా మారిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేయాలని నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు సైతం లాలూచీ పడి రికార్డుల్లో 1బీ ఎక్కించారన్నారు. జిల్లా కలెక్టర్.. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమార్కులతో చేతులు కలిపిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రికార్డుల నుంచి 1-బీని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న మాజీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు ఈ భూమిని ఎలాగైనా కాజేయాలని కుట్రలు పన్ని ధర్మవరాన్ని కాదని అనంతపురంలో మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఇక.. ధర్మవరంలో ఆ రిజిస్ట్రేషన్‌కు ఓకే చేయించుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. ప్రలోభాలకు లొంగి రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సాక్ష్యాత్తు గతంలో దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ బత్తలపల్లిలోని 401 సర్వే నంబరులోని 19.84 ఎకరాలు పూర్తిగా బెంగళూరుకు చెందిన నిడిమామిడి మఠంభూమి అనీ, ఇందులో క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ చేయరాదనీ, నేరుగా జిల్లా రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేసిన సంగతిని గుర్తు చేశారు. కొందరు అధికారులు ఈ ఉత్తర్వులను సైతం పక్కన పడేసి అక్రమార్కులతో చేతులు కలపడం దారుణమన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా గత వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు చేసిన అక్రమాలు, దోపిడీపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటనారాయణ, వెంకటస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

## జగనన్న పాపం..
# ఫ్లోరైడ్ బారిన జనం..!

**ట్యాంకులు శుభ్రం చేయడానికి నిధులేవీ?**



గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు రూపాయి కూడా నిధులివ్వలేదు. దీంతో పంచాయతీల్లో ట్యాంకులను శుభ్రం చేయాలన్న విషయం మరచిపోయి చాలాకాలమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.
-నాగభూషణం, కొక్కంటి క్రాస్

గత వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ చేసిన పాపానికి ప్రజలు ఫ్లోరైడ్ భూతం బారిన పడుతున్నారు. సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణకు గత వైసీపీ సర్కారు నిధులివ్వకుండా నిర్లక్ష్యం చేసింది. వేతనాలు అందక ఆ పథకంలో పనిచేస్తున్న కార్మికులు రోడ్డునపడ్డారు. చాలా గ్రామాలకు మంచినీరు సరఫరా కాలేదు. జనం ఫ్లోరైడ్ నీరే తాగాల్సి వస్తోంది. తద్వారా 40 ఏళ్లకే వృద్ధాప్యఛాయలు వారిలో కనిపిస్తున్నాయి. అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**అటకెక్కిన సత్యసాయి నీటి పథకం నిర్వహణ**
నాలుగేళ్లుగా ఆగిన సరఫరా
నిధులివ్వని గత వైసీపీ సర్కారు
60 శాతం గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరే గతి



నిరుపయోగంగా సత్యసాయి తాగునీటి పథకం షెడ్డు



నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

**తనకల్లు, జూలై 20:**
జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆ నీటిని తాగి జనం తీవ్ర అనారోగ్యం బారిన పడుతుండేవారు. దీంతో పుట్టపర్తి సత్యసాయిబాబా రూ.వేల కోట్లు ఖర్చు చేసి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్నపల్లి వద్ద నుంచి మంచినీటిని మండలంలోని అన్నిగ్రామాలకు అందించే పథకాన్ని పూర్తి చేశారు. పెద్దపెద్ద పైపులైన్ల ద్వారా నీటిని తీసుకొచ్చారు. ట్యాంకులు నిర్మించి, ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించారు. తరువాత ఆ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, రూ.వేలకోట్లు ఖర్చు చేసింది. మరిన్ని ట్యాంకులు నిర్మించింది. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న గ్రామాలకు మంచినీరు సరఫరా చేశారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టగానే తాగునీటి పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. 2020లో ఈ పథకాలను మండలంలో పూర్తిగా ఆపేసింది. దీంతో పథకంలో పనిచేస్తున్న కార్మికులు రోడ్డునపడ్డారు. 60శాతం గ్రామాలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించాల్సి ఉండగా.. నాలుగేళ్లుగా చుక్క నీరు రాలేదు. దీంతో 60 శాతం గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటిని తాగాల్సి వస్తోంది.

**తూతూమంత్రంగా నీటి పరీక్షలు**

మండలవ్యాప్తంగా మంచినీటిని నిల్వ చేసుకునేందుకు 36 ట్యాంకులు, 90 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 60 స్టాండ్ పోస్టులు ఏర్పాటు చేశారు. వైసీపీ పాలకుల నిర్వాకం మూలంగా నీరు రాక అవన్నీ నిరుపయోగంగా మారాయి. వీటిని శుభ్రం చేసి, ఎన్నేళ్లయిందో కూడా అటు అధికారులు, ఇటు ప్రజలకు తెలియదు. 15 రోజులకోసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్న నిబంధనలను గాలికొదిలేశారు. కొన్నేళ్లుగా ఆ ట్యాంకులను శుభ్రం చేసిన పాపానపోలేదు. అధికారులు నీటి పరీక్షలు సైతం తరచూ నిర్వహించాల్సి ఉంది. పరీక్షలే నిర్వహించకుండా చేసినట్లు నమోదు చేసుకుంటున్నారు. మండలంలోని 20 గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మండలకేంద్రంలో మంచినీటి సమస్య ఉంది. జల్‌జీవన్ మిషన్ ద్వారా 80 గ్రామాలకు ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేశామని అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ఫ్లోరైడ్ నీటి బాధ తప్పుతుందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**నాలుగేళ్లుగా నీరు రాలేదు**

గత నాలుగేళ్లుగా సత్యసాయిబాబా పథకం ద్వారా మంచినీరు మండలానికి సరఫరా కాలేదు. దీతో అందులో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడ్డారు. ఫ్లోరైడ్ రహిత నీటిని ప్రజలకు అందించాలన్న ఆశయాన్ని గత వైసీపీ ప్రభుత్వం చంపేసింది.
- పారేసు, చీకటిమానుపల్లి

**సమస్యలు గుర్తిస్తాం**

ఓవర్‌హెడ్ ట్యాంకులు, జీఎల్ఎస్ఆర్, స్టాండ్ పోస్టులు, క్లోరినేషన్ తదితర సమస్యలను గుర్తిస్తాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తాం.
- కృష్ణమూర్తిరెడ్డి, ఇన్‌చార్జి ఈఓఆర్డీ



తనకల్లులోని మందిరంలో షిరిడీసాయి మూలవిరాట్







ప్రత్యేక అలంకరణలో సాయికుల్వంత్ సభామండపం, సంగీతకచేరి నిర్వహిస్తున్న జయంత్ బృందం

# నేడు గురుపౌర్ణమి

జిల్లావ్యాప్తంగా ముస్తాబైన బాబా మందిరాలు
ప్రశాంతి నిలయంలో వేడుకలు ప్రారంభం
అలరించిన సంగీత కచేరి

**పుట్టపర్తి, జూలై 20:** గురుపౌర్ణమికి జిల్లా ముస్తాబైంది. ఆదివారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా బాబా మందిరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పుట్టపర్తిలోని సాయికుల్వంత్ సభామండపంలో శనివారం సాయంత్రం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలుత విద్యార్థులు వేదాన్ని పఠించారు. అనంతరం జయంత్ బృందం సంగీత కచేరీ నిర్వహించింది. గంటపాటు వేణు, మృదంగ వాయిద్యాలతో భక్తులను అలరింపజేశారు. గురుపౌర్ణమి వేడుకలకు సాయికుల్వంత్ సభామండపమాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో పాల్గొనడానికి వేలాదిమంది భక్తులు ప్రశాంతినిలయం చేరుకున్నారు.

## జిల్లాలో తేలికపాటి జల్లులు

**పుట్టపర్తి రూరల్, జూలై 20:** జిల్లాలో అక్కడక్కడ శుక్రవారం రాత్రి తేలికపాటి జల్లులు కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు. రొళ్లలో అత్యధికంగా 8.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. అమరాపురం 7.2, హిందూపురం 6.4, సోమందేపల్లి 6.0, కొత్తచెరువు, పెనుకొండ 5.2, గుడిబండ 5.0, మడకశిర 3.6, రొద్దం, లేపాక్షి 3.4, పుట్టపర్తి, ఓబుళదేవరచెరువు, నల్లచెరువు 2.4, బుక్కపట్నం 1.4 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు పేర్కొన్నారు.

## రేపు ఫుట్‌బాల్ సెలెక్షన్స్

**హిందూపురం, జూలై 20:** జిల్లా సబ్‌జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. 2011 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31లోపు జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్, జనన ధృవీకరణపత్రం, నాలుగు ఫొటోలు, మెడికల్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల ఒప్పందపత్రం అందజేయాల్సి ఉంటుందన్నారు. హిందూపురంలోని ఎంజీఎం క్రీడామైదానంలో ఉదయం 9గంటలకు సెలెక్షన్స్ ప్రారంభమవుతాయని తెలిపారు.



# చెరువులన్నింటికీ నీరివ్వండి

**నీటి పారుదల శాఖ మంత్రికి సవిత వినతి**



నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ టౌన్, జూలై 20:** జిల్లాలోని చెరువులన్నింటికీ నీరు ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత కోరారు. విజయవాడలో శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో చెరువులకు నీరందించలేదన్నారు. దీంతో చెరువుల కింద ఆయకట్టు భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయన్నారు. పంటలు సాగు చేసుకునే అవకాశం లేక రైతులు వలస వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం చెరువులన్నింటికీ నీరు ఇచ్చి, రైతులను ఆదుకోవాలని మంత్రిని సవిత కోరారు.

## బస్సు సర్వీసులు పెంచండి

గత టీడీపీ హయాంలో కియ, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో రద్దీ పెరిగిందనీ, పెనుకొండ డిపోకి నూతన బస్సు సర్వీసులు కేటాయించాలని రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని మంత్రి సవిత కోరారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. పెనుకొండ డిపో అభివృద్ధిపై గత వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

# కూల్చారు.. వదిలేశారు..!

వైసీపీ పాలనలో ఇష్టారాజ్యం
తాడిమర్రిలో రోడ్డు విస్తరణ మాటున ఇళ్ల కూల్చివేత
పనులు కూడా చేపట్టని దుస్థితి
బోసిపోయిన ప్రధాన రహదారి
నిర్వాసితులకు అందని పరిహారం



ఇళ్ల కూల్చివేతతో కళావిహీనంగా ప్రధాన రహదారి

**తాడిమర్రి, జూలై 20:** గత వైసీపీ పాలన అంతా కూల్చివేతలతోనే సాగిందన్న విమర్శలు బహిరంగంగానే ఉన్నాయి. అందుకు తాడిమర్రిలో ప్రధాన రహదారి విస్తరణ మాటున చేపట్టిన కూల్చివేతలే నిదర్శనం. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండానే రహదారి పక్కన ఇళ్లను కూల్చేశారు. పోనీ.. రోడ్డు నిర్మాణమైనా చేపట్టారా.. అంటే అదీలేదు. ఉన్న ఇళ్లను కూల్చేయడంతో నిర్వాసితులు రోడ్డున పడ్డారు. పరిహారం అందక ఎదురు చూస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా..**

ఉత్తర్వులు, ఆర్థిక, పరిపాలన అనుమతులు రాకుండానే తాడిమర్రిలో రోడ్డు విస్తరణ మాటున ఇళ్లను కూల్చేశారు. గత ఆగస్టు 11న కోర్టు స్టే ఇచ్చినా లెక్కచేయకుండా రోడ్డుకిరువైపులా ఉన్న భవనాలను కూల్చివేశారు. మొత్తం 87 మందికి సంబంధించిన ఇళ్లను పడగొట్టారు. పరిహారం విషయం మాత్రం దాటవేశారు. ఫలితంగా ఎవరు ఎంత మొత్తంలో ఇంటిని కోల్పోయారు, ఎన్ని సెంట్ల స్థలాన్ని నష్టపోయారోనన్న రికార్డులు రెవెన్యూ, అర్అండ్‌బీ శాఖల వద్దలేవు. ఇంటి పెద్ద చనిపోయాడనీ, రెండురోజులు సమయం ఇవ్వండని వేడుకున్నా.. అప్పటి అధికార పార్టీ చోటా నాయకులు వినలేదు. ఆ తరువాత కూటమి అభ్యర్థిగా సత్యకుమార్‌యాదవ్ మండల కేంద్రంలో బహిరంగ సభ ఏర్పాటుచేసినపుడు రోడ్డు నిర్వాసితులకు ఇంటి స్థలం, పరిహారం తప్పకుండా అందిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో నిర్వాసితుల్లో ఆశలు చిగురించాయి.



తాడిమర్రిలో ఎక్స్‌కవేటర్‌తో ఇళ్లను కూల్చేస్తున్న దృశ్యం (ఫైల్)

**సామగ్రి తీసేసుకుంటామన్నా వినలేదు..**



ఇంట్లోని సామగ్రి తీసుకుంటామన్నా వినలేదు. వెంటనే తొలగించాల్సిందేనంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఇంటి కోసం వాడిన ఇనుప సామగ్రి ఎందుకూ పనికి రాకుండా పోయింది.
- గంగాధర్ గుప్తా, రోడ్డు నిర్వాసితుడు

**పరిహారం ఎప్పుడిస్తారో..?**



పరిహారం ఇవ్వకుండా ఇళ్లను కూల్చి తీవ్ర అన్యాయం చేశారు. ఆ తరువాత మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడు. అధికారులు పరిహారం ఊసే ఎత్తలేదు. మాకు ఎదురు చూపులు తప్పలేదు.
- భాస్కర్‌గౌడ్, రోడ్డు నిర్వాసితుడు



చెరువుకట్ట వద్ద నగరోత్సవంలో సాయినాథుడు



రథాన్ని లాగుతున్న దృశ్యం



యువతి కోలాటం..

# సాయినాథుడి నగరోత్సవం పులకించిన అనంత జనం



వేణుగోపాల్‌నగర్‌లో కోలాటం



వేణుగోపాల్‌నగర్‌లో సాయినాథుడు



కళాకారుల విన్యాసాలు

సాయి నామస్మరణ, భక్తిగీతాలాపన, నగరోత్సంతో అనంత వీధులు పులకించాయి. గురు పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరం ఆధ్వర్యంలో హంస వాహనంపై సాయినాథుని నగరోత్సవం నిర్వహించారు. విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. చెరువుకట్ట షిర్డీసాయి ఆలయం ఆధ్వర్యంలోనూ సాయినాథుని నగరోత్సవం నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ, కోలాటమాడుతూ ముందుకు సాగారు. వందలాది మంది భక్తులు వేడుకలలో పాల్గొన్నారు.

-అనంతపురం కల్చరల్



చెరువుకట్ట వద్ద నగరోత్సవంలో భక్తుల కోలాటం



తుంగభద్ర డ్యాంలో వరదనీరు

## నిండుకుండలా టీబీ డ్యాం

దిగువ ప్రాంతాలకు ప్రమాద హెచ్చరికలు జారీ

**కణేకల్లు/బొమ్మనహాళ్, జూలై 20:** రాయలసీమకు తాగు, సాగునీటిని అందించే తుంగభద్ర డ్యాం శనివారం నీటితో నిండుకుండలా మారింది. దీంతో డ్యాం దిగువ ప్రాంతాల ప్రజలకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. 1,03,956 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్న డ్యాంలో దాదాపు 68 టీఎంసీల నీరు చేరుకుంది. దీంతో ఏ క్షణమైనా గేట్లు ఎత్తి నీటిని దిగువ వైపునకు వదిలేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా డ్యాం దిగువ ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యాం కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఏ క్షణంలోనైనా డ్యాం గేట్లు ఎత్తి నీటిని హగరిలోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విషయాన్ని ఆయా గ్రామాలలో అధికారులు మైకుల, దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు కూడా తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డ్యాం ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతోపాటు డ్యాంకు ఇన్‌ఫ్లో పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 28న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

**అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20:** బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వతేదీన ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల క్యాటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. జూనియర్‌కి 2005 జనవరి 2వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, సబ్ జూనియర్స్‌కు 2009 జనవరి 2వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు సబ్‌జూనియర్ అన్నవరం, జూనియర్ విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు యూని ఫాం, క్రీడాసామగ్రి, జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9966188133, 8919428343లను సంప్రదించాలని కోరారు.

## టమోటా కిలో రూ.56

**అనంతపురం రూరల్, జూలై 20:** కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.56తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.48, కనిష్ఠ ధర రూ.35 పలికినట్లు ఆయన తెలిపారు.

## చీనీకాయలు టన్ను రూ.20వేలు

**అనంతపురం రూరల్, జూలై 20:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1045టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం

### రూ.23,52,000 బదిలీ చేయించుకున్న వైనం

**హిందూపురం, జూలై 20:** పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో సింధు అనే మహిళకు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు సింధు అనే మహిళ ఏడాది కిందటి వరకు బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేసింది. గతకొంత కాలంగా అనారోగ్యంతో ఇంట్లో ఉంది. ఈ తరుణంలో ఈనెల 15న ఆమెకు ఫోన్‌కాల్ వచ్చింది. మీకు వర్క్‌ఫ్రంహోమ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. దీంతో ఆమె రూ.2వేలు నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరడంతో పంపింది. కొంతసేపటికే ఆమెకు రూ.2,800 నగదు వాపసు వచ్చింది. ఆ తరువాత వారు చెప్పిన విధంగా నాలుగైదుసార్లు రూ.23,52,840 పంపింది. అయితే రెండ్రోజులుగా ఫోన్‌కాల్ చేసిన వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి బ్యాంక్ వద్దకు వెళ్లి విచారించగా అది మోసపూరితకాల్ అని చెప్పారు. దీంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు సింధు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## మాచర్లలో అనంత విద్యార్థి ఆత్మహత్య



పవన్‌కుమార్

**పుట్లూరు, జూలై 20:** పల్నాడు జిల్లా మాచర్లలో బీటెక్ చదువుతున్న పవన్‌కుమార్ (23) శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రమాదేవి దంపతుల కుమారుడు పవన్‌కుమార్. తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పవన్‌కుమార్ మాచర్ల పట్టణంలోని న్యూటన్స్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ రూంలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది.

## జేసీ కేతన్ గార్గ్ బదిలీ

### జడ్పీ సీఈఓ.. నగరపాలిక కమిషనర్ కూడా..



కేతన్‌గార్గ్

**అనంతపురం టౌన్, జూలై 20:** జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ బదిలీ అయ్యారు. రెండున్నరేళ్ల క్రితం ఆయన జిల్లాకు జేసీగా వచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బదిలీ అనివార్యమైంది. రాష్ట్రవ్యాప్తంగా 62 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జేసీ కేతన్‌గార్గ్ కూడా ఉన్నారు. ఆయనను రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ, ఐఏఎస్ అధికారి వైకోమ్ నిదియాదేవిని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. రాజంపేట సబ్ కలెక్టర్‌గా ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఆమె జెడ్పీ సీఈఓగా వచ్చారు. సర్వశిక్ష అభియాన్‌కు ఏపీసీగా కూడా పనిచేస్తున్నారు. అనంతపురం నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. వారి స్థానంలో జిల్లాకు జాయింట్ కలెక్టర్, జడ్పీ సీఈఓ, నగరపాలిక కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు.

## సంపత్‌ను ఆపేశారా..?

### బాధ్యతలు చేపట్టని విద్యుత్ శాఖ ఎస్ఈ
### ఉదయం నుంచి రాత్రి వరకూ హైడ్రామా
### రీ పోస్టింగ్ కోసం సురేంద్ర ప్రయత్నాలు..?

**అనంతపురం రూరల్, జూలై 20:** విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్ బాధ్యతల స్వీకరణపై సందిగ్ధత నెలకొంది. అనంతపురం సర్కిల్ ఎస్ఈగా సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఉదయం 11 గంటల తరువాత ఆయన బాధ్యతలు చేపడుతారని శాఖలోని వారికి సమాచారం అందింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అదిగో.. ఇదిగో అంటూ మధ్యాహ్నం దాకా వేచి చూశారు. మూడు గంటలకు బాధ్యతలు చేపడుతారని సమాచారంతో కొందరు మళ్లీ వద్దామనుకుని వెళ్లిపోయారు. మరికొందరు అక్కడే ఉండిపోయారు. రాత్రి వరకు ఆయన కోసం ఎదురుచూశారు. కానీ ఆయన బాధ్యతల స్వీకరణను సీఎండీ నిలబెట్టినట్లు చర్చ జరుగుతోంది. ఇక్కడ పనిచేస్తున్న సురేంద్ర.. రీ పోస్టింగ్‌కు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సురేంద్ర ఎస్ఈగా పనిచేసినంత కాలం వైసీపీ ప్రజాప్రతినిధులకు అంటకాగి పనిచేశారన్న విమర్శలున్నాయి. అన్నింటా వారికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు, వర్కులు ఇవ్వడంలో తొలి ప్రాధాన్యం వైసీపీ వారికే ఇచ్చారని ఆయా వర్గాల్లో చర్చనడుస్తోంది. సబ్ స్టేషన్ల ఏర్పాటులోను వైసీపీ శ్రేణులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. దీనికితోడు శాఖలోను ఒక వర్గానికే ప్రాధాన్యం ఇచ్చారని, వారు తప్పులు చేసినా వెనకేసుకొచ్చారని విమర్శలు ఉన్నాయి. కొత్తగా వస్తున్న సంపత్‌కుమార్ జిల్లా వాసి కావడం, గతంలోనూ ఇక్కడ పనిచేయడం గమనార్హం. అందరికీ సమప్రాధాన్యం ఇస్తారని కూడా అంటనాత్నరు. ఏం జరుగుతుందో వేచిచూడాలి.



ఎస్ఈ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

## ఆటోడ్రైవర్ దారుణ హత్య

### తలపై బండరాయితో మోది చంపిన వైనం



సూర్యనారాయణ (ఫైల్), విలపిస్తున్న కుటుంబ సభ్యులు

**ధర్మవరం రూరల్, జూలై 20:** మండలంలోని సీసీ కొత్తకోట గ్రామం వద్ద ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ (48) దారుణంగా హత్య చేశారు. తలపై బండరాయితో మోది చంపేశారు. ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రికి చెందిన సూర్యనారాయణకు చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన కృష్ణవేణితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తరువాత సూర్యనారాయణ భార్య పుట్టినిల్లయిన వెల్దుర్తికి వెళ్లి, అక్కడే ఉంటుండేవాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆటో తోలుకుంటూ ధర్మవరం వెళ్లాడు. అదేరోజు రాత్రి సీసీ కొత్తకోట వద్ద గుర్తుతెలియని వ్యక్తులు.. సూర్యనారాయణ తలపై బండరాళ్లతో మోది, హత్య చేశారు. శనివారం ఉదయం అటుగా వెళ్లినవారు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నరేంద్ర.. హత్యాస్థలాన్ని పరిశీలించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. సూర్యనారాయణ భార్య కృష్ణవేణి, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. క్రిష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు వివాహేతర సంబంధమా? భూతగాదాలా, ఇతర కారణాలున్నాయా అన్నకోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### నిందితులను త్వరలోనే పట్టుకుంటాం: ఎస్పీ

సూర్యనారాయణ హత్యకేసు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. సూర్యనారాయణ హత్య వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హత్యను సీరియస్‌గా తీసుకుని, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ క్రిష్ణయ్య

**అనంతపురం సెంట్రల్, జూలై 20:** జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ క్రిష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు శనివారం ఉత్తుర్వులు జారీచేశారు. వీసీ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ క్రిష్ణయ్యకు ఉత్తర్వులు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణయ్యకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సురేంద్రనాయుడు, ఆర్ఈఎఫ్ నాయకులు నాగభూషణం, మంజునాథ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలంద జేసి శుభాకాంక్షలు తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి క్రిష్ణయ్యను సన్మానించారు.



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

# ఇదేం స్టేషన్..? ఇట్లుంది..!

● అనంత రైల్వే స్టేషన్ నిర్వహణపై డీఆర్ఎం అసంతృప్తి ● సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



స్టేషన్ ఆవరణలో పరిశీలిస్తున్న డీఆర్ఎం విజయ్‌కుమార్



సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న డీఆర్ఎం

**అనంతపురం న్యూటౌన్, జూలై 20:** డీఆర్ఎం విజయ్‌కుమార్ తొలిసారి అనంతపురం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వివిధ విభాగాలను శనివారం తనిఖీ చేశారు. సమస్యలపై అసహనం వ్యక్తంచేశారు. భవన నిర్మాణాల్లో నాణ్యతాలోపాలను గుర్తించి ప్రశ్నలు గుప్పించారు. ఏజీఎం జయకుమార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నిర్మాణాలు ఇలా కూడా ఉంటాయా..? ప్రయాణికులకు పదికాలాలపాటు ప్రయోజనం కలిగేలా నిర్మించాలి కదా..?' అని ప్రశ్నించారు. స్టేషన్‌లో దెబ్బతిన్న గ్రానైట్, టైల్స్‌ను చూసి ఏమిటి ఈ పరిస్థితి అని ప్రశ్నించారు. అధికారులు డీఆర్ఎంకు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. ప్రయాణికులు లగేజీ బ్యాగులు తగిలించడంతో గ్రానైట్ డ్యామేజ్ అయిందని అన్నారు. దీంతో 'ప్రయాణికులు బ్యాగులు లేకుండా వస్తారా..? నాణ్యమైన గ్రానైట్ వాడాలి కదా..?' అని ప్రశ్నించారు. దీనికి ఇంజనీరింగ్ అధికారుల వద్ద సమాధానం కరువైంది. స్టేషన్ ఆవరణలోని ప్రతి గదినీ డీఆర్ఎం తనిఖీ చేశారు. తాళం వేసిన వాటిని కూడా వదల్లేదు. సిగ్నలింగ్ రూంలో వెంటిలేటర్స్ లేకపోవడంతో ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఎక్కడి సామగ్రి అక్కడే ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు రాకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగు నీటిలో ప్రయాణికులు వెళ్లాలా అని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్‌ను పిలిపించి, నిర్వహణ అధ్వానంగా ఉందని అన్నారు. స్టేషన్‌లో చాలా సమస్యలున్నాయని, మరోసారి తాను వస్తానని, ఈలోగా అన్నింటినీ పరిష్కరించాలని సూచించారు. లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఏడీఆర్ఎం సుధాకర్, డీఈఎన్ వెస్ట్ మనికంఠ, సీనియర్ డీఓఎం శ్రావన్, డీఎస్‌టీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు



**నల్లచెరువు, జూలై 20:** ప్రసిద్ధిచెందిన మండలపరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజ చేశారు. అనంతరం కోర్కెల నివారణ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భజన బృందం భజన చేశారు. దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు

ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

## నేడు గురుపౌర్ణమి వేడుకలు



తనకల్లులో విద్యుత్ దీపాలంకరణలో బాబా ఆలయం

**తనకల్లు, జూలై 20:** మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాబా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

**నల్లచెరువు:** మండలకేంద్ర సమీపంలోని షిర్డీసాయి ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధి కసంఖ్యలో స్వామివారిని దర్శంచుకోవాలని కోరారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

**నల్లమాడ:** మండలకేంద్రంలోని షిర్డీ బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు, పెద్దలు తెలిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో ముస్తాబు చేశారు. భక్తులు అధికసంఖ్యలో బాబాను దర్శించుకోవాలని కోరారు. భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఘనంగా శ్రీగిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**పుట్టపర్తి, జూలై 20:** సత్యసాయి శ్రీగిరి ప్రదక్షిణను శనివారం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ప్రశాంతినిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సత్యసాయి భక్తి గీతాలు అలపిస్తూ రథాన్ని లాగుతూ గిరిప్రదక్షిణ నిర్వహిం చారు. గోకులం, గణేష్ కూడలి, పెట్రోలు బంకు, చింతతోపు, గోవిందపేట, శివాలయం వీధి, సత్యమ్మఆలయం, గోపురంమీదుగా తిరిగి గణేష్ వద్దకు చేరింది. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు

**నల్లచెరువు, జూలై 20:** సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని బాలేపల్లి తండా, రాజమోళ్లపల్లి తండాల్లో శనివారం వైద్యాధికారి అలేఖ్య వైద్యశిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి సర్వే చేపట్టారు. మొత్తం 61మందికి చికిత్సలు అందించి, 23మంది రక్త నమూనాలు సేకరించామని వైద్యాధికారి తెలిపారు. అలాగే దోమల లార్వా నివారణకు 48 ఇళ్లలో మందు పిచికారి చేశామన్నారు. ఆమెతో పాటు సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్ వైజర్లు సుధాకర్, రెడ్డి, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు ముద్దవ్యాధి టీకాలు

**నల్లచెరువు:** మండల వ్యాప్తంగా పశువులకు ఈ నెల 20 నుంచి ఆగస్టు 18వరకుముద్దవ్యాధి టీకాలు వేస్తున్నట్లు పశువైద్యాధికారి మల్లికార్జున శనివారం తెలిపారు. ఆగస్టు 18వరకు టీకాలు వేస్తామన్నారు. తవళం మర్రి, పంతులచెరువు పంచాయతీల్లోని 380 పశువులకు శనివారం టీకాలు వేశామన్నారు. పశువైద్య సిబ్బంది సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో యువకుడి మృతి

**గాండ్లపెంట, జూలై 20:** మండలంలోని వడ్డిరెడ్డిపల్లికి చెందిన గణేష్‌సాయి (23) అనే యువకుడు గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. తమ పెద్ద కుమారుడు గణేష్‌సాయి ఐటీఐ చేసి, తాడిపత్రిలో ని ఓ ప్రయివేటు పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నట్లు మృతుడి తల్లిదండ్రులు వెంకటరమణ, రామలక్ష్మి తెలిపారు. అతడు శని వారం అయాసంగా ఉందని ఇంట్లో పడుకున్నాడని, కొంతసేపటికి లేపినా లేవకపోవడంతో ప్రయివేటు వైద్యుడిని సంప్రదించామన్నారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందారని ఆయన నిర్ధారించారని విలపించారు. తమకు మరో కుమారుడున్నాడని తెలిపారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



రెడ్డిబాషా (ఫైల్)

**కదిరిఅర్బన్, జూలై 20:** మండలంలోని కట్లతండా గ్రామం వద్ద శనివారం అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందినట్లు రూరల్ ఏఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వీధిలో నివాసముంటున్న పీరుసాబ్, ఫాతిమా కుమారుడు రెడ్డి బాషా (30) ఓ పూల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇంటి నుంచి శుక్రవారం సాయత్రం బయటకెళ్లిన రెడ్డి బాషా రాత్రికి తిరిగి రాలేదు. ఉదయం కట్లతండా వద్ద శవమై పడున్నట్లు స్థానికులు కుటుంబ సభ్యులకు ఫోన్‌ద్వారా తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరిశీలించారు. శవంపై ఎలాంటి గాయాలు లేవని ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి అన్న ఖాదర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కుక్కలదాడిలో పది గొర్రెల మృతి

**ఓబుళదేవరచెరువు, జూలై 20:** మండలంలోని దిగువపల్లికి చెందిన జెరిపిటి ఆంజనేయులు గొర్రెల మందపై శనివారం ఉదయం కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో పది గొర్రెలు మృతిచెందగా, రూ. లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. బాధితుడు తెలిపిన మేరకు.. అతడు ఎప్పటిలాగే గొర్రెల మందను ఊరి బయట ఉన్న దొడ్డిలోకి తోలాడు. అయితే ఆ దొడ్డి వెనుక వైపున పాడిన ఇల్లు ఉంది. ఆ ఇంటి వైపు నుంచి దాదాపు పది కుక్కలు ఒక్కసారిగా మందపై దాడిచేశాయి. గొర్రెలు అవరడంతో ఆంజనేయులుతో పాటు మిగిలిన కాపరులు మందలోకి వెళ్లే సరికి కుక్కలు పారిపోయాయి. అప్పటికే ఎనిమిది గొర్రెలు మృతిచెందాయన్నారు. తీవ్రంగా గాయపడిన మరో రెండు గొర్రెలు చికిత్సలు అందించేలోగా మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు 40గొర్రెలను పాలికి తీసుకుని మేపుతున్నామ న్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు. బాధితుడిని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి జెరిపిటి ఆంజనప్ప, తెలుగుయువత నాయకుడు జెరిపిటి ప్రసాద్, బూత్ కన్వీనర్ రాకేష్ తదితరులు శనివారం పరామర్శించారు. జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం ఆదుకునేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

# సంక్షేమం, అభివృద్ధి అందరి అజెండా కావాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పుట్టపర్తిరూరల్, జూలై 20:** ప్రజాసంక్షేమం, అభివృద్ధి మనందరి అజెండా కావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపుని చ్చారు. అర్హులందరికి సంక్షేమఫలాలు అందాలని, పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించడంలో అధికారులందరూ ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ ఎంవీ రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా మండలంలోని అమగొండపాల్యం సర్పంచు రామచంద్ర మృతికి సభలో సంతాపం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమఫలాలు అర్హులైన ప్రజలందరికి అందాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ సంక్షేమఫలాలను ప్రజలందరికి అందించడంలో అధికారులందరూ ప్రముఖపాత్ర పోషించాలన్నారు. ప్రజాసామ్యపద్ధతిలో ప్రజలచే ఎన్నుకైన ప్రజాప్రతినిదులందరూ ఎన్నికల రణరంగం ఆలోచనల నుంచి బయటకొచ్చి పార్టీలతీతంగా ప్రజాసేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపినిచ్చారు. అనంతరం సమావేశంలో అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన నివేదికలను సమర్పించారు. ఆయాశాఖలకు సంబంధించిన సమ స్యలే కాకుండా అవసరమైన ప్రతిపాదనలను తన దృష్టికి తీసుకు రావాలని, వాటి పరిష్కారానికి తోడ్పాటు అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకు మునుపు మండలంలోని బొంతలపల్లి సర్పంచు శ్రీనివాసులు, కప్పలబండ సర్పంచు చిన్నపెద్దన్న తమ పంచాయతీల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తొలిసారి మహిళా ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లె సింధూరరెడ్డిని సమావేశానికి హాజరైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికా రులు పూలమాలలు, దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ శుభదాసు, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్
- యోగివేమన రిజర్వాయర్ పరిశీలన



యోగివేమన రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

**ముదిగుబ్బ, జూలై 20:** ధర్మవర నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఆయన శనివారం ముదిగుబ్బ మండలంలోని యోగివేమన రిజర్వాయర్‌ను పరిశీలించారు. ప్రాజెక్టు నిర్వహణ సరిగా లేకపోవడంతో నీరు వృథా అవుతోందని అధికారులు ఆయనకు వివరించారు. అలాగే స్థానిక రైతులు, గ్రామాల ప్రజలతో శ్రీరామ్ మాట్లాడారు. రిజర్వాయర్ నుంచి నీరందని ప్రాంతాలపై ఆరా తీశారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ యోగివేమన రిజర్వాయర్ నుంచి మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించే ఆలోచన చేస్తున్నట్లు వివరించారు. కేవలం వర్షాధారంగా ఉన్న ఈ ప్రాజెక్టుకు శాశ్వత నీటి కేటాయింపులపై త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రాజెక్టు నిర్వాహణ సరిగా లేదన్నారు. కావున అవసర మైన మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలన్నారు. ఆ త ర్వాత వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు నీరిచ్చే అంశం గురించి పరిశీలిస్తామన్నారు. అలాగే జిల్లేడు బండ, చిత్రావతి రిజర్వాయర్ ముంపు నిర్వాసితుల తరఫున తాము గతంలో పోరాడామని, ఇప్పుడు న్యాయం చేస్తామన్నారు. త్వరలోనే అన్ని అంశాల గురించి మంత్రి సత్యకుమార్‌తో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరణం ప్రభాకర్, అశ్వత్థరెడ్డి, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, గోపాల్ రెడ్డి, కనుమ చంద్ర, చికెన్ తిరుపాల్, త్రిలోక్, ఆనంద్, మహబూబ్‌పీరా, శిరిగారిపల్లి రవి, జాని, రంగయ్య, వెంకటనారాయణ, క్రిష్టయ్య, సూరి, బాలకృష్ణ, గంగాధర్, మోహన్, చంద్రసేన, వెంకటపతి పాల్గొన్నారు.

### సంగాల చెరువుకు నీరు తెస్తాం

**బత్తలపల్లి:** మండలంలోని సంగాల చెరువును నీటితో నింపుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరాం తెలిపారు. మండలంలోని సంగాల చెరువును ఆయన శనివారం ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులతో కలసి పరిశీలించారు. చెరువుకు నీరివ్వాలని ఎప్పటి నుంచో రైతులు అడుగుతున్నారని, వారి కోరిక మేరకు పరిశీలించామన్నరు. వీలైనంత త్వరలో రావులచెరువు, యరగుంటపల్లి మీదుగా చెరువుకు నీరందిస్తామని తెలిపారు. ఈ విషయమై త్వరలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలుస్తామన్నారు.

## దివ్యాంగుల భవన్‌కు పేపర్ ప్లేట్ల మిషన్ వితరణ



పేపర్ ప్లేట్ల మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

**కదిరి, జూలై 20:** పట్టణంలోని దివ్యాంగుల భవనానికి అభిజ్ఞా ఫౌండేషన్ అధినేత, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి శనివారం పేపర్ ప్లేట్లు తయారు చేసే యంత్రాన్ని వితరణ చేశారు. దానిని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఆ యంత్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ... అభిజ్ఞా ఫౌండేషన్ అధినేత, టీడీపీ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు, కుమార్తె జన్మదినం సందర్భంగా ఈయంత్రాన్ని వితరణ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ యంత్రం ద్వారా పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

## ఎంపీపీ రాజీనామా ఆమోదం

**గాండ్లపెంట, జూలై 20:** స్థానిక ఎంపీపీ రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈఓ నందియాదేవి ఆమోదించినట్లు ఎంపీడీఓ రామానాయక్ శనివారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... ఈ నెల 8న ఎంపీపీ తాతం జగన్మోహన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సీఈఓకు రాజీనామా పత్రాన్ని సమర్పించారన్నారు. ఎవరి వత్తిడి, ప్రమేయం లేదని స్వయంగా రాజీనామా చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారన్నారు. సీఈఓ రాజీనామాను ఆమోదించినట్లు ఎంపీడీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయని ఎంపీడీఓ తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

**కదిరి అర్బన్, జూలై 20:** ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు మరిచిపోయిన హ్యాండ్‌బ్యాగ్‌ను డ్రైవర్ జులానాయక్ అధికారులకు అందించి తన నిజాయితీని చాటుకున్నారు. ఎన్పీకుంట మండలంలోని మండెం వారిపల్లికి చెందిన తేజశ్వని అనే ప్రయాణికురాలు శుక్రవారం రాయచోటిలో కదిరికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఆమె కదిరిలోని జీవిమాను సర్కిల్‌లో బస్సు దిగింది. అయితే తన హ్యాండ్‌బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయింది. బస్సు బస్టాండ్ చేరుకున్న తరువాత డ్రైవర్ బస్సును పరిశీలిస్తుండగా ప్రయాణికురాలు మరిగిపోయిన హ్యాండ్ బ్యాగును గుర్తించాడు. దానిని తీసుకెళ్లి డిపో అధికారులకు అప్పగించాడు. తన హ్యాండ్ బ్యాగ్‌ను బస్సులోనే మరిచిపోయినట్లు ఫిర్యాదుచేయడానికి బాధితురాలు శనివారం కదిరి ఆర్టీసీ డిపో వద్దకు వెళ్లింది. బ్యాగ్‌లో రూ. రెండు లక్షలు విలువ చేసే బంగారం ఉందని ఆమె తెలిపారు. దీంతో ఆమెకు అధికారులు బ్యాగ్‌ను అప్పగించి, డ్రైవర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు హరిత, సుబ్బయ్య, ఎన్ఎంయూ నాయకులు బైరిశెట్టి ఉన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం గడువు పొడిగింపు

**పుట్టపర్తి, జూలై 20:** వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీం గడువును 2024-25కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ ఎంఎస్- 82 విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం ఓప్రకటనలో తెలియచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జర్నలిస్టు హెల్త్‌స్కీం ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు వైద్యసేవల కోసం ప్రతిసారి రూ. రెండు లక్షల వరకు లబ్ధిపొందవచ్చని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు పేర్కొన్నారు.

## తహసీల్దార్ల బదిలీ

**పుట్టపర్తి, జూలై 20:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జోన్-4లోని జిల్లాలకు చెందిన తహసీల్దార్లు వారి సొంత జిల్లాలకు బదిలీ ఆయ్యారు. జిల్లా నుంచి 27 మంది తహసీల్దార్లు బదిలీ కాగా ఇతర జిల్లాలలో పనిచేస్తున్న 27 మంది తహసీల్దార్లను కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకోవాలంటూ ఆదేశాలు జారీ ఆయ్యాయి. కలెక్టరేట్ నుంచి ఆయా మండలాలకు తహసీల్దార్లను కేటాయించనున్నారు.

## కేజీబీవీ ఎస్ఓపై ఆర్డీఓ విచారణ

**నంబులపూలకుంట, జూలై 20:** మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికా విద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఓ రిహానా పనితీరుపై శనివారం ఆర్డీఓ వంశీకృష్ణ విచారణ చేపటారు. ఇటీ వల పాఠశాల తనిఖీలో భాగంగా జీసీడీఓ విచారణ చేసి, ఎస్ఓను విధులనుంచి తొలగించారు. దీంతో ఎస్ఓ రిహానా కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ శనివారం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను విడివిడిగా విచారించారు. విద్యార్థినులను వివరాలు అడిగినట్లు తెలిసింది. ఆయనతోపాటు తహసీల్దార్ నరేంద్ర కుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ తరగతులు

**పుట్టపర్తి, జూలై 20:** జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులకు శనివారం శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో సీపీఓ విజయ్‌కుమార్ శిక్షణాతరగతులను ప్రారంభించారు. పంటకోత పరిశీలన, వ్యవసాయగణన, వర్షపాతం తదితర ఆంశాలపై వారంరోజులపాటు శిక్షణా తరగతులు జరుగనున్నాయి. శిక్షణా తరగతుల నిర్వహణాధికారి ఏడీ శ్రీనివాస నాయక్, డిప్యూటీ ఎస్ఓ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మోటార్ల చోరీపై కేసు

**కదిరి అర్బన్, జూలై 20:** మండలంలోని కదిరి కుంట్లపల్లి వద్ద కంకర మిషన్‌లో 22 విద్యుత్ మోటార్లు చోరీ అయినట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. కుంట్లపల్లి వద్ద నిర్వహిస్తున్న కంకర మిషన్‌లో ఈనెల 16న గుర్తు తెలియని వ్యక్తులు 5.హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 22 మోటార్లు చోరీ చేసినట్లు తెలిపారు. కంకర మిషన్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# అసైన్డ్ భూములను అనర్హులకు కట్టబెడుతున్నారు

- విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలి
- ఆర్డీఓను కోరిన కుణుతూరు రైతులు



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న కుణుతూరు రైతులు

**ధర్మవరం రూరల్, జూలై 20:** గత ప్రభుత్వంలో గుట్టలను, అసైన్డు భూములను అనర్హులకు కట్టబెట్టారని, వాటికి ప్రస్తుత తహసీల్దార్, వీఆర్ఓ మ్యుటేషన్‌లు, వన్‌బీలు చేస్తున్నారని కుణుతూరు రైతులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆపి, అర్హులైన రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డిని వారు శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు ఆర్డీఓతో మాట్లాడుతూ.... తమ గ్రామంలో సర్వేనెంబర్లు 436, 28, 176, 456, 138లలోని సుమారు 100ఎకరాల వరకు అసైన్డు భూమి ఉందని, అందులో చాలా భూ మిలో రాళ్ల గుట్టలు, కొండలు ఉన్నాయన్నారు. ఆ భూమిని అసైన్ మెంట్‌లో పె ట్టారని, అదికూడా అనర్హులను అసైన్‌మెంట్‌లో చేర్చడంతో లోకాయుక్తను ఆశ్రయించామన్నారు. దీంతో అప్పట్లో అధికారులు ఆ భూమికి సంబంధించి పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. అయి తే ప్రస్తుతం తహసీల్దార్ రమేష్, వీఆర్ఓ గిరిధర్‌రెడ్డి వాటికి మ్యు టేషన్ చేస్తూ వన్‌బీలు, పాసుపుస్తకాలను మంజూరు చేస్తు న్నారని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సమగ్ర విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. దీనిపై ఆర్డీఓ సమాధాన మిస్తూ... సమగ్ర విచారణ చేయించి అనర్హులను తొలగిస్తామని హా మీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు విశ్వనాథ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, వెంకటరెడ్డి, గోవిందురెడ్డి, శ్రీనివాసరెడ్డి, శంకర్‌రెడ్డి, రాము, ఈశ్వరయ్య, ఆనంద్‌రెడ్డి, లింగమయ్య, నాగ భూషణ, కేశవయ్య, వెంకటేష్, తీర్థప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

**ధర్మవరం, జూలై 20:** పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్ స్వామి ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి అలంకరించారు. అనంతరం మహిళలతో ఏడు శనివారాల వ్రతం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వర ప్రసాద్, ప్రధానకార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌కు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులు

**పుట్టపర్తి, జూలై 20:** హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రసాద్‌శుక్ల శనివారం రాత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన బయలుదేరి రాత్రి 10.40గంటకు ప్రశాంతినియలంలోని శాంతిభవన్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు టీఎస్ చేతన్, ఎస్పీ వి రత్న, అడిషనల్ ఎస్పీ విష్ణు, ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఆర్డీఓ భాగ్యరేఖ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. ప్రశాంతినిలయంలో ఆదివారం జరిగే గురుపూర్ణిమ వేడుకల్లో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ పాల్గొననున్నారు.

## ఏపీఐఐసీ భూములపై నివేదిక ఇవ్వండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

**పుట్టపర్తి, జూలై 20:** జిల్లాలో ఏపీఐఐసీ సేకరించిన భూములపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. యంత్రాంగాన్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కప్పలబండ, మడకశిర, హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరుతోపాటు అన్నిప్రాంతాల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఇటీవల సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై చర్చించారు. వాటిపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. టిడ్కోగృహాలు ఏస్థితిలో ఉన్నాయో హౌసింగ్ అధికారులు పరిశీలించి, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రత్నగిరి, రాళ్ళపల్లి, జిల్లేడుబండ రిజర్వాయర్ల పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాషా, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీపీఓ విజయ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

## నంబులపూలకుంటలో నేడు పీర్ల జలధి



ఎన్పీకుంట పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

**నంబులపూలకుంట, జూలై 20:** మొహరం సందర్భంగా మండలకేంద్రంలో కొలువుదీరిన పీర్లు ఆదివారం జలధికి తరలించనున్నట్లు ముజావర్ షానూ, నిర్వాకులు తెలిపారు. చావిడి వద్ద శనివారం రాత్రి అగ్నిగుండం వెలిగించి, అలావు తొక్కారు. భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి పానకాలు తీసుకెళ్లారు. పీర్లకు చక్కెర చదివింపులు చేశారు.

## ఎంఈఓలు పాఠశాలల పనితీరుపై శ్రద్ధచూపాలి

విద్యాశాఖ ఏడీ-2 రామకృష్ణ

**కొత్తచెరువు, జూలై 20:** ఎంఈఓలు తమ మండలాల్లోని పాఠశాలల పనితీరుపై శ్రద్ధ చూపాలని విద్యాశాఖ ఏడీ-2 రామకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లాలోని 32 మండలాల ఎంఈఓల సమావేశాన్ని డీఈఓ మీనాక్షి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఎంఈఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీ-2 మాట్లాడుతూ... పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతాన్ని ఎంఈఓలు పరిశీలించాలన్నారు. ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత వంటి విషయాలను తెలుసుకోవాలన్నారు. ఎమ్మార్సీలో ఇన్‌వర్డ్, ఔట్‌వర్డ్ రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించాలన్నారు. కోర్టు కేసులు, ఉపాధ్యాయుల అనధికారిక గైర్హాజరుపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో వసతులు, నాడు-నేడు పనులు, విద్యార్థులకు తాగునీరు తదితర వాటిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ-1 నాగరాజు, డిప్యూటీ డీఐఈఓ రంగస్వామి పాల్గొన్నారు.

## వేరుశనగ, కంది పంటల పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

**కదిరి, జూలై 20:** మండలంలోని కుటాగుళ్ల గ్రామంలో సాగుచేసిన వేరుశనగ, కంది పంట పొలాలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో సందర్శించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వేరుశనగ పంటను ఆశించిన ఆకుముడత, పొగాకు లద్దె పురుగును పరిశీలించారు. వాటి నివారణకు ఫినాల్ పాస్ - 2 ఎంఎల్ లేదా క్లోరోఫైడిపాస్ - 2 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిసి ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పొగాకు లద్దె పురుగు నివారణకు ఖయోడిక్ కార్బ్ 1గ్రా. లేదా నవ క్యూరాన్ ఒక ఎంఎల్ పిచికారి చేయాలన్నారు. ప్రధానంగా కందిని ఎండు తెగులు సోకుతోందన్నారు. నివారణకు ట్రైకోధర్మావిరిడీ ఫార్ములాను ఉపయోగించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కుటాగుళ్ల గ్రామంలోని పి రామాంజనేయులు, రాజు పొలాలను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. ఆయనతోపాటు సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ, ఏఈఓలు లలిత, లావణ్య, ఆర్బీకే సిబ్బంది విమల, రైతులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి

వీరప్పగారిపల్లి మహిళల ధర్నా

**ఓబుళదేవరచెరువు, జూలై 20:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ, లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందంచని వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారికి ఆర్పీపీ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్పీపీ డివిజన్ కార్యదర్శి మున్నా, టీడీపీ బీసీ సెల్ నాయకుడు ఇరుగొట్టు ఆంజనేయులు మాట్లాడుతూ... వీరప్పగారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా విధుల కు హాజరుకావడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు చిన్నా రులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించడం లేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఖాజాబీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, గ్రామస్థులు రత్నమ్మ, గౌతమి, ఈశ్వరమ్మ, వరలక్ష్మి, ఆంజనేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు ఫొటోల అందజేత



ఫొటోలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, జూలై 20: స్థానిక ప్రభుత్వ కార్యాలయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత ఫొటోలను టీడీపీ నాయకులు శనివారం అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు త్రివేంద్రనాయుడు, సుబ్రహ్మణ్యం, రామాంజనేయులు, కౌన్సిలర్ హనుమంతు, శ్రీనివాసులు తదితరులు నగరపంచాయతీ కార్యాలయానికి వెళ్లి మేనేజర్ నరసింహులును కలిసి ఫొటోలు అందించారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ఈ ఫొటోలను అందజేయాలని మేనేజర్‌ను టీడీపీ నాయకులు కోరారు.

## 23న న్యాక్ బృందం రాక

పెనుకొండ,జూలై 20: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఈనెల 23న న్యాక్ బృందం రానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా న్యాక్‌బృందం కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహిస్తుందన్నారు. న్యాక్ గ్రేడింగ్‌తో కళాశాలకు హోదా, ఆర్థికంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. విద్యార్థులకు సైతం ఎన్నో విధాలుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు.

## హాస్టల్‌ను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ విజయక్‌కుమార్‌రెడ్డి

గోరంట్ల, జూలై 20: పట్టణంలోని కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్‌ను స్పెషలాఫీసర్, డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లో 26మందికిగాను 16మంది ఉండగా, వారితో మాట్లాడారు. హాస్టల్ పాతభవనం కావడంతో వైరింగ్ సరిగాలేక, కొన్ని ఫ్యాన్లు, లైట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. తాగునీరు, ఇతర అవసరాలకు నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు స్పెషలాఫీసర్‌కు విన్నవించారు. స్టోర్ గదిని, స్టాక్ రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వార్డెన్ వేణుగోపాల్, ఈఓఆర్డీ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

గోరంట్ల, జూలై 20: మండలంలోని బెల్లాలచెరువు గ్రామానికి చెందిన వెంకటేష్ (24) మద్యం మత్తులో ఉరివేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తండ్రి చనిపోవడంతో వెంకటేష్ మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా జూలాయిగా తిరిగేవాడని పోలీసులు తెలిపారు. ఇలా ఉండగా భూమి అమ్మగా వచ్చిన డబ్బుల కోసం తన తల్లి రత్నమ్మతో తరచు గొడవపడేవాడు. ఇద్దరు కుమార్తెలను బాగా చూసుకుంటూ, తనను నిర్లక్ష్యం చేస్తున్నావని, శుక్రవారం తల్లితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. మద్యం సేవించి రాత్రి ఇంటికి వచ్చిన వెంకటేష్ రేకుల షెడ్ గదిలో తలుపుల వేసుకుని నిద్రించారు. శనివారం ఉదయం ఎంతసేపటికి లేవకపోవడంతో కిటికీ లోనుంచి చూడగా పైకప్పునకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

హిందూపురం, జూలై 20: పట్టణంలోని రహమత్‌పురం ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.13వేలకుపైగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరుణ్‌బాషా తెలిపారు.

## వైభవంగా తాడి నాగమ్మ దేవత ఉత్సవాలు



తాడినాగమ్మదేవతను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

మడకశిర రూరల్, జూలై 20: మండలంలోని కదిరేపల్లి గ్రామంలో తాడి నాగమ్మదేవత ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. గుర్రపుకొండ గ్రామం నుంచి తాడినాగమ్మ ఉత్సవవిగ్రహాలను గ్రామాల గుండా ఊగింపుగా తీసుకుచ్చారు. గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ శాంతలక్ష్మి

పెనుకొండ రూరల్, జూలై 20: బాల్యవివాహాలు చేయడం నేరమని పెనుకొండ సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. రొద్దం మండలంలోని కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో 'బాల్యవివాహాలు అరికడదాం.. ఆడబిడ్డలను కాపాడుకుందాం' అనే కార్యక్రమంపై గ్రామస్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే వివాహాలు చేయడంవల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలపై లఘుచిత్రాల ద్వారా అవగాహన కల్పించారు.

# గురుపౌర్ణమికి ఆలయాల ముస్తాబు



నానెప్పనగర్‌లోని షిర్డీసాయి మూలవిరాట్



సత్యనారాయణపేటలోని శేషసాయి



గురుపౌర్ణమికి ఆలయం వద్ద అలంకరణ చేస్తున్న భక్తులు

హిందూపురం అర్బన్, జూలై 20: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో షిర్డీ సాయిబాబా ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. నానెప్పనగర్‌లోని ఆలయంలో భక్తులకు ఇబ్బందిలేకుండా దర్శనానికి ఏర్పాట్లు చేశారు. బాబా మూల విరాట్‌ను సుందరం గా ముస్తాబు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచే నుంచి వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ సాయినాథ సప్తాహ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా బాబానామసంకీర్తన(ఏకాహం) పఠించారు. సత్యనారాయణపేటలోని శేషసాయి ఆలయంలో 108 మంది ముత్తయిదువులతో 108 రకాల నైవేద్యాలు పురవేధుల్లో ఊరేగించి అనంతరం బాబాకు సమర్పించారు.



సోమందేపల్లిలో..

హిందూపురం(సోమందేపల్లి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకకు షిర్డీ సాయి సేవా సమితివారు ఘనంగా ఏర్పాట్లు చేశారు. వారు మాట్లాడుతూ గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఆలయంలో ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం జరుగుతాయన్నారు.

పెనుకొండ: గురుపౌర్ణమి పురస్కరించుకుని పట్టణంలోని ప్రాచీన షిర్డీసాయి మందిరంతోపాటు ఆల్విన్‌కాలనీలోని షిర్డీసాయి, సత్యసాయి భజన మందిరాలు ముస్తాబయ్యాయి. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఆల్విన్ కాలనీలోని బాబామందిరంలో ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఉదయం 5గంటలకు నగర సంకీర్తన, పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి భజన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# షిరిడీ సాయినాథుడికి విశేష పూజలు



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



షిరిడీసాయినాథుడి ఊరేగింపులో పాల్గొన్న తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూలై 20: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని షిరిడీసాయినాథుని ఆలయం ఆవరణలో స్వామివారికి శనివారం విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక షిరిడీసాయి వ్రతాలు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. ఆదివారం జరిగే గురుపౌర్ణమి వేడుకలకు పట్టణంనుంచేకాక నియోజకవర్గం వ్యాప్తంగా వచ్చే వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేపట్టారు.

**'గుండుమల' ప్రత్యేక పూజలు**

పట్టణంలోని షిరిడీసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన స్వామివారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. గురుపౌర్ణమి వేడుకలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

అగళి, జూలై 20: మండలంలోని రామనపల్లి వద్ద కరెంటు పోల్‌ను ఓ కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు చెందిన రాకేష్, శ్యామల శనివారం లేపాక్షిలోని దేవాలయం వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం హేమావతికి బయల్దేరారు. దారి తప్పి అగళి వైపు వస్తుండగా రామనపల్లి దగ్గర కారు వెనుక చక్రం పంచర్‌కావడంతో అతివేగంతో వెళ్లి 33కేవీ లైన్ పోల్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. గమనించిన స్థానికులు వీరిని శిరాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వివాహం నిశ్చయమైన నేపథ్యంలో ఆలయాల సందర్శనకు వెళుతూ బాధితులు ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. వీఆర్‌ఓ వెంకటలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ప్రమాదంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

## ట్రాఫిక్ నియమాలను పాటించాలి

మడకశిర టౌన్, జూలై 20: ద్విచక్ర వాహనాలను నడిపే వ్యక్తులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్‌లను ధరించాలని మడకశిర జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఆర్.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం లీగల్ లిటరసీ క్యాంపును నిర్వహించారు. అందులో భాగంగా న్యాయాధికారి మాట్లాడుతూ వాహనం నడిపే ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ఎంతో అవసరం అన్నారు. నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోపాల్‌రావు, నాగేంద్ర, నాగభూషణ్, గోపీనాథ్, కోర్టుసిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 20: చిలమత్తూరు మండలంలోని పాలేపల్లికి చెందిన వెంకటరమణమ్మ కుటుంబ కలహాలతో శనివారం ఆత్మహత్యకు యత్నించారు. పాలేపల్లికి చెందిన సత్యనారాయణ, వెంకటరమణమ్మ దంపతుల మధ్య వివాదం జరగ్గా, మనస్తాపంతో ఆమె అధిక మోతాదులో మాత్రలు మిగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

## కొళాయి నీటి కోసం ఘర్షణ

గోరంట్ల, జూలై 20: పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో కొళాయి నీటికోసం శనివారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో కొర్రు ఆంజనేయులు గాయపడ్డాడు. పంచాయతీ వారు వదిలిన నీటిని పట్టుకునే విషయంలో కొర్రు ఆంజనేయులు పక్కింటి శ్రీనివాసరెడ్డితో ఘర్షణపడ్డారు. శ్రీనివాసరెడ్డి, హరితోపాటు కుటుంబ సభ్యులు కొర్రు ఆంజనేయులపై దాడిచేసి గాయపరిచారు. గాయపడిన ఆంజనేయులును గోరంట్ల ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం తరలించారు.

## ప్రతిభా పురస్కారాల పంపిణీకి తరలిరండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సంఘం నాయకులు

పెనుకొండ రూరల్, జూలై 20: ఆర్య, ఈడిగ, గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న హిందూపురంలో నిర్వహించే ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి రావాలని ఆ సంఘం నాయకులు కిరణ్‌కుమార్‌గౌడ్, విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు కరపత్రాలు విడుదల చేశారు. ఈనెల 27న ఉదయం 11గంటలకు బాలాజీ టాకీస్ ఎదురుగా ఈడిగ ప్యాలెస్‌లో 2023, 2024సంవత్సరంలో టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శేఖర్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ గౌడ్, సంఘం నాయకులు వినయ్, తిరుమలేశ్, గురుప్రతాప్‌గాంధీ, లక్ష్మీపతి, రవీంద్రగౌడ్ పాల్గొన్నారు.

## శాకంబరి అలంకరణలో వాసవీమాత



పెనుకొండ, జూలై 20: ఆషాఢ మాసం సందర్భంగా కన్యకాపరమే శ్వరీ అమ్మవారిని శనివారం శాకంబరి రూపంలో అలంకరించారు. అర్చకులు శేషగిరిస్వామి ఆధ్వర్యంలో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సుధాకర్‌గుప్త, సూర్యనారాయణ, తదితరులు మహిళా సంఘం సభ్యులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసంలో శాకంబరి రూపంలో అమ్మవారిని అలంకరిస్తే మంచిజరుగుతుందని అర్చకులు పేర్కొన్నారు.

## ద్విచక్రవాహనం, బొలెరో ఢీ

### దంపతులకు తీవ్ర గాయాలు

పెనుకొండ రూరల్, జూలై 20: రొద్దం మండలంలోని పెనుకొండ, పావగడ ప్రధాన రహదారిలో మరువపల్లి చెక్‌పోస్టువద్ద శనివారం ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నారనాగేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, అతడి భార్య రత్నమ్మ ద్విచక్రవాహనంపై రొద్దంలోని వారపుసంతకు వచ్చారు. సంత ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మరువపల్లి చెక్‌పోస్టు వద్ద మలుపు తిరుగుతుండగా పావగడ నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న శ్రీనివాసులు, రత్నమ్మలకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రత్నమ్మను హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్నికల హామీలను నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 20: ఎన్నికల సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు శనివారం తహసీల్దార్ అంజనాదేవికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ రైతులకు ఇస్తామన్న పంట సహాయం రూ.20వేలు, ఉపాధి కూలీలకు 200రోజుల పనిదినాలతోపాటు రోజుకూలీ రూ.600 చెల్లించాలని కోరారు. గత ఏడాది రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లో దాదాపు 350 మండలాల్లో 25లక్షల ఎకరాల్లో రైతులు విత్తనాలు వేసుకోలేదన్నారు. అలాగే 30లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. 500 మంది రైతులు, కౌలుదారులు తుపాను కారణంగా నష్టపోయినట్లు తెలిపారు. పంటలబీమా పరిహారం రైతుల ఖాతాలో జమచేయాలన్నారు. కౌలు రైతులకు సంక్షేమ పథకాలను వర్తింపజేసి గుర్తింపు కార్డులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెస్త కిష్టప్ప, కల్లుగీత కార్మికులు రామక్రిష్ణ, చేనేత సంఘం నాయకులు గంగరాజు, చీల నారాయణస్వామి, కుమ్మరకిష్టప్ప, సీఐటీయూ నాయకులు కొండ వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు కోసం భవనం పరిశీలన



తహసీల్దార్ భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారులు

హిందూపురం, జూలై 20: కోర్టు కోసం పాత తహసీల్దార్ భవనాన్ని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీధర్ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం కోర్టు ఆవరణలో ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు భవనం, ప్రత్యేక కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈనేపథ్యంలో ఇటీవల హిందూపురానికి జిల్లా న్యాయాధికారి వచ్చినప్పుడు కోర్టు భవనాల శిథిలావస్థ గురించి ఆయనకు వివరించారు. ఈ విషయాన్ని ఆయన.. కలెక్టర్‌కు వివరించడంతో కొద్దిరోజుల కిందట కలెక్టర్ చేతన్ స్థానికంగా ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయ భవనం తాత్కాలికంగా కొంతకాలం ఇస్తామని చెప్పారు. దీంతో శనివారం ఏడీజే తహసీల్దార్ భవనాన్ని పరిశీలించారు. త్వరలోనే రెండు కోర్టుల నిర్వహణ ఇక్కడి నుంచే ప్రారంభిస్తామని ఏడీజే తెలిపారు. న్యాయాధికారుల వెంట కోర్టు ఏఓ నరసింహులు, న్యాయవాదులు శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్, సిద్దు, కళావతి, శివశంకర్ పాల్గొన్నారు.

## సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి బుజ్జప్ప

పెనుకొండ టౌన్, జూలై 20: స్థానిక సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప శనివారం తనిఖీచేశారు. సబ్‌జైలులో ఉన్న వసతులను పరిశీలించారు. ఖైదీలకు వండిన ఆహారాన్ని, సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న ఆహారం, వైద్యసేవలు, మంచినీరు, ఇతర సదుపాయాల గురించి ఖైదీలతో ఆరాతీశారు. వారు ఏఏ కేసుల్లో జైలులో ఉన్నారని సూపరింటెండెంట్‌తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశమై క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలే నేరాలకు కారణమవుతున్నాయన్నారు. తద్వారా కుటుంబసభ్యులు మనోవేదనకు గురవుతారన్నారు. ఎవరూ ఉద్వేగాలకు లోనుకాకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షేక్ అజ్గర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

## సైన్స్‌తోనే అభివృద్ధి: ప్రిన్సిపాల్

హిందూపురం అర్బన్, జూలై 20: ఏ దేశ అభివృద్ధి అయినా సైన్సుతోనే సాధ్యమని ఎస్ఎస్‌వీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి పేర్కొన్నారు. శనివారం కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ప్రస్తుత ప్రపంచం సైన్సుతోనే నడుస్తోందన్నారు. అయితే అది విశ్వమానవ కల్యాణం కోసం మాత్రమే వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్ సామాజిక సమస్యలను పరిష్కరిస్తుందా అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఇందులో హేమలత, షిహిస్తా అంజూమ్, సవేరాబానులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా యశోదాదేవి, హేమావతి, పోలయ్య, శ్రీలక్ష్మి వ్యవహరించారు.

## రేపు డయల్ యువర్ డీఎం

హిందూపురం అర్బన్, జూలై 20: ఆర్టీసీ సంస్థలో నెల కొన్న సమస్యల పరిష్కారానికి సోమవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిందూపురం ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. హిందూపురం డిపో పరిధిలోని బస్సులు, రవాణా సౌకర్యం, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర విషయాలపై నేరుగా డిఎంకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. సమస్యలను 9959225858కు ఫోన్ చేయాలన్నారు.

## కూలిన ఇల్లు

గుడిబండ, జూలై 20 : మండలంలోని శింగేపల్లి గ్రామానికి చెందిన వడ్డి శివన్న ఇల్లు ఇటీవల కురిసిన వర్షానికి తడిసి కూలిపోయిందని బాధితులు తెలిపారు. ఉన్న ఇల్లు కూలిపోవడంతో నిరాశ్రయులైనట్లు బాధితులు తెలిపారు.